# బీసీల దమ్మేంటో చూపిస్తాం..



మన ఓట్లు మనకే
నినాదంతో
ముందుకుపోదాం

బడుగులను అణగదొక్కేందుకు చేస్తున్న కాంగ్రెస్ కుట్రలపై బీసీ సంఘాలు భగ్గుమంటున్నాయి. కుల కుంపటిని రాజేస్తున్న ఆ ఆపార్టీ నేతలపై బీసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బీసీలంతా ఏకతాటి పైకి రావాల్సిన ఆవశ్యకతను వారు తెలియజేస్తున్నారు. 'బీసీ అభ్యర్థిని ఎలా గెలిపిస్తారో చూస్తాం' అన్న కాంగ్రెస్ నేతల దురహంకార మాటలను సవాల్‌గా తీసుకుని బీసీల సత్తాను నిరూపించాల్సిన సమయం వచ్చిందంటున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో 6 స్థానాలను బీసీలకు కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించిన కేసీఆర్ గొప్పతనాన్ని బీసీ నేతలు కొనియాడుతున్నారు. చేవెళ్లలో బీసీ అభ్యర్థిని గెలిపించుకుని బీసీల దమ్మేంటో చూపిస్తామని స్పష్టం చేస్తున్నారు. బీసీ వర్గాలను అవమానించేలా మాట్లాడితే నాలిక కోస్తామని హెచ్చరిస్తున్నారు. బడుగులను చులకన భావంతో చూస్తున్న కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెబుతున్నారు. మన ఓటు మన బీసీ అభ్యర్థికి వేసుకుని గెలిపించుకుందామని పిలుపునిస్తున్నారు. జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీల గొంతుక పార్లమెంటులో వినబడాలంటే బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా ఉండాల్సిన అవసరం ఉందంటున్నారు. - రంగారెడ్డి, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ)

### బీసీల ఓట్లు లేకుండా ఎలా గెలుస్తారో చూస్తాం..



చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చాటుతాం. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతోకాలంగా కృషి చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కే మా మద్దతు. బీసీలపై అహంకార పూరితంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు బీసీల ఓట్లు లేకుండా ఎలా గెలుస్తారో చూస్తాం. బడుగుబలహీన వర్గాల ప్రజలను చులకనగా చూస్తున్న రాజకీయ పార్టీలు, నేతలకు ఓటుతో తగిన బుద్ధి చెబుతాం.

- డి.గోపాల్, రామయ్యగూడ, వికారాబాద్

### బీసీనేతకు పట్టం కడుతాం..



ఎంపీ ఎన్నికల్లో బీసీవాదాన్ని పూర్తి స్థాయిలో వినిపిస్తాం. మాకు కావాల్సింది బీసీ నేతల గెలుపు. చేవెళ్ల స్థానం నుంచి పోటీ చేస్తున్న బీసీ నేత కాసానికి ఓటేసి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తాం. బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో ప్రగతి చెందేందుకు అవకాశం ఉంటుంది. ఏదైమైనా బీసీలందరం ఏకమై కాసానిని గెలిపించుకుంటాం.

- రాజశేఖర్‌గౌడ్, వైస్ ఎంపీపీ కులకచర్ల మండలం

### రాజకీయ పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థికి మద్దతిద్దాం..



కాంగ్రెస్ నాయకులు బీసీలను అవహేళన చేయడం సరికాదు. బీసీలు కనికరించకపోతే కాంగ్రెస్‌కు అధికారం దక్కేదా..? ఇంత అహంకారం పనికిరాదు. ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ నాయకుల అసలు రూపం బయటపడుతున్నది. ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదు. బీసీల సత్తా చూపాలి. బీసీలందరూ ఏకమై మన బీసీ అభ్యర్థికి భారీ విజయాన్ని అందిద్దాం. - శ్రీనివాస్‌యాదవ్, మూలమాడ, నవాబుపేట

### కాసాని విజయం ఖాయం..



ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కాసానికి బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉన్నది. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకొని బీసీవాదాన్ని నిరూపిస్తాం. బీసీలను చిన్న చూపుచూస్తున్న పార్టీలకు కనువిప్పుకలిగేలా ఈ ఎన్నికల్లో కాసానిని గెలిపించుకుంటాం. బీసీల ఐక్యతగా అంటే ఎలా ఉంటుందో అందరికీ అర్థమయ్యేలా చేస్తాం.

- సందని రామకృష్ణ, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకుడు, ముజాహిద్‌పూర్, కులకచర్ల

### మన ఓట్లు మనకే..



రాష్ట్రంలో 70 శాతం ఉన్న బీసీల సత్తా ఎంటో పార్లమెంట్ ఎన్నికల్లో చూపించాలి. బీసీలను కించపరిచేలా మాట్లాడిన మోహన్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలంటే చేవెళ్ల పార్లమెంట్ బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే అది బీసీ ఎంపీలతోనే సాధ్యమవుతుంది.

- కంచర్ల శేఖర్, ఆర్కేపురం డివిజన్ వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు

### బీసీలంతా ఏకతాటిపైకి రావాలి..



పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటి పైకి రావాలి. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరుపున ముదిరాజ్ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశం కల్పించడం సంతోషకరం. బీసీలకు దమ్ముంటే కాసానిని ఎంపీగా గెలిపించుకోవాలని ఓ నాయకుడు విసిరిన సవాల్‌కు మనమందరం ఏకమై ఓటు ద్వారా సమాధానం చెప్పాలి.

- ననాజీపురం లింగం, ముదిరాజ్ సంఘం షాబాద్ మండల అధ్యక్షుడు

### కాసానిని గెలిపిద్దాం.. బీసీల గళం వినిపిద్దాం..



బీసీ గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. అగ్రవర్ణ రాజకీయ నాయకుల వక్రబుద్ధికి సమాధానం చెప్పే ఆయుధమైన ఓటు మన చేతిలోనే ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీని అందిస్తాం. కాసాని గెలుపుతో మన బీసీల గొంతుక లోక్‌సభలో వినిపిస్తుంది.

- సి.తిరుపతి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు, యాలాల

### బీసీకి టికెట్ ఇవ్వడం హర్షణీయం..



బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించడం హర్షణీయం. బీసీలందరం సమష్టిగా కృషి చేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం. ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా ఉన్నప్పుడు బీసీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. జ్ఞానేశ్వర్ గెలుపు చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి ఎంతో అవసరం.

- విజయ్‌కుమార్, హైదర్‌గూడ

### అహంకారులకు చెంపపెట్టు..



బీసీలంతా ఐక్యంగా ఉండి ఎన్నికలో వెనకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా నిలువాల్సిన అవసరం ఎంతో ఉన్నది. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి ఇచ్చి ఆ వర్గాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కాంగ్రెస్, బీజేపీలు మాత్రం అందుకు భిన్నంగా అగ్రకులాలకు చెందిన వారికి టికెట్లు కేటాయించాయి. అందుకే కాసానిని గెలిపించుకోవాలి.

- అందె నర్సింహ

### కాసాని గెలుపునకు కృషి చేయాలి..



పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా సేవ చేసిన అనుభవం జ్ఞానేశ్వర్‌కు ఉన్నది. అత్యధికంగా ఉన్న బీసీలంతా పార్టీలకతీతంగా ఏకమై కాసానిని గెలిపించుకుంటాం.

- పి.కుమార్‌యాదవ్, బీసీ నేత, కుమ్మరిగూడ, షాబాద్ మండలం

### ఓటుతో బీసీల సత్తా చాటుతాం..



చేవెళ్ల స్థానంలో బీసీ అభ్యర్థికి ఓటేసి బీసీల సత్తా చాటుతాం. కాసాని గతంలో 96 బీసీ కులాలను ఒక్క చోటుకి తెచ్చి ఐక్యవేదిక ఏర్పరిచారు. బీసీలను అవమాన పర్చేలా కాంగ్రెస్ పార్టీ దురహంకార మాటలు బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

- శ్రీనివాస్ గౌడ్, తాండూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

### గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం



రానున్న ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల నుంచి గెలిపించుకొని బీసీల ఐక్యతను చాటుతాం. బీసీలపై కొందరు నాయకుల వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేసి ఆరు ఎంపీ సీట్లు కేటాయించడం అభినందనీయం. బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగినబుద్ధి చెబుతాం.

మారోజు రామాచారి, విశ్వకర్మ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### ఐక్యతే మరింత మందికి అవకాశమిస్తుంది..



వెనకబడిన వర్గాల ఐక్యతను చాటుకోవటం ద్వారా బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలి. అప్పుడే భవిష్యత్‌లో మరింత మంది బీసీలకు అవకాశాలు వస్తాయి. కేవలం ఓటు బ్యాంకుగా వాడుకునే రాజకీయ పార్టీల మాటలను నమ్మి మోసపోకుండా బీసీలు ఐకమత్యంతో ముందుకెళ్లాలి.

- సత్యనారాయణ, మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు

### ఏకమై.. అహంకారాన్ని ఎదిరిస్తాం..



బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీసీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసింది. కానీ, కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని రోజులకే ఆ పార్టీ నేతలు అహంకార ధోరణితో విర్రవీగుతున్నారు. బీసీలను తక్కువ చేస్తూ కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు. చేవెళ్లలో బీసీ అభ్యర్థికి ఓటేసి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెబుతాం.

- శ్రీనివాస్‌గౌడ్, అత్తాపూర్

## సేవాలాల్ విగ్రహ స్థాపనకు వేలాదిగా తరలండి

### వాల్‌పోస్టర్ విడుదలలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 15: సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు వేలాదిగా తరలి రావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పిలుపునిచ్చారు. తన నివాసంలో సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి పాత తండాలో మండల వైస్ తదఎంపీపీ నీలమోహన్‌నాయక్, మాజీ సర్పంచ్ రవీనాయక్, మాజీ ఎంపీటీసీ మోహన్‌నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్మాణానికి ఈ నెల 22 తేదీ నుంచి 24 వరకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి గిరిజన నాయకులు, ప్రజలు వేలాదిగా తరలిరావాలన్నారు. సంత్ సేవాలాత్ సేవలకు గుర్తుగా ఆయన విగ్రహ ఏర్పాటుకు ముందుకు వచ్చిన వారిని అభినంధించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ నీలంనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి, నీరటి రాజే ముదిరాజ్, మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, మాజీ ఎంపీటీసీ మోహన్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, పలువురు గిరిజన నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## వంద శాతం పోలింగ్ నమోదుకు చర్యలు

- జూబ్లీహిల్స్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 5010..
- ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు విధిగా ఓటు వేయాలి
- జూబ్లీహిల్స్ ఏఆర్ఓ దశరథ్ సింగ్ రాథోడ్



శిక్షణ శిబిరాలలో పోస్టల్ బ్యాలెట్లను పంపిణీ చేస్తున్న ఏఆర్వో దశరథ్ సింగ్ రాథోడ్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికలలో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో పాటు ఇంటినుంచి బయటకు రాలేని వయోవృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 85 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు, పర్సన్ విత్ డిజేబుల్ (పీడబ్ల్యూడి) ఓటర్లతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌ల పంపిణీ చేపడుతున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని జూబ్లీహిల్స్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్ సింగ్ రాథోడ్ తెలిపారు. సోమవారం ఖైరతాబాద్ తహసిల్దార్ నయీముద్దీన్‌తో కలిసి జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌లను పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సీనియర్ సిటిజన్స్, పీడబ్ల్యూడి విభాగంతో పాటు అధికారులు, సిబ్బందితో కలిపి మొత్తం 5010 మంది పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులైన ఓటర్లున్నారని తెలిపారు. వీరిలో ఆసక్తి ఉన్న వారికి ఫారం-12 డి పంపిణీ చేశామని.. ఇందులో అర్హులైన వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని.. ఆయా శిబిరాలలో పోస్టల్ బ్యాలెట్‌లను పంపిణీ చేస్తున్నట్లు ఏఆర్ఓ దశరథ్ సింగ్ రాథోడ్ తెలిపారు.

## నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు : డిప్యూటీ మేయర్

బండ్లగూడ, ఏప్రిల్ 15: వేసవి కాలంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు రాకుండా నీటి సరఫరాను పెంచాలని జల మండలి జీఎం రవీందర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి ఫోన్ ద్వారా వివరించి విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన జల మండలి జీఎం రవీందర్‌రెడ్డి మాట్లాడారు. సోమవారం నుంచి అధికంగా 2ఎంఎల్‌ల నీటిని వదిలేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైతే మంచినీటి ఇబ్బందులు ఉన్నదో అక్కడ వాటర్ ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా 2వేల సింథటిక్ ట్యాంకులను ఏర్పాటు చేసి నీటి సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంచినీటి ఇబ్బందులు రాకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు.

### కేంద్రంలో మరోసారి పట్టం కట్టరూ..

హిమాయత్‌నగర్,ఏప్రిల్15: కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వానికే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం ఇంటింటికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెట్టిన ఫ్రంట్‌కు టెంట్ లేదని ఆ పార్టీ గెలిచేది లేదు చచ్చేది లేదంటూ తీవ్ర స్థాయిల్లో విమర్శించారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యామ్నాయం లేదని, దేశం మోదీ చేతిలో ఉంటేనే భద్రంగా ఉండటంతో పాటు మరింత అభివృద్ధి చెందుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉంద న్నారు. తెలంగాణలో మెజార్టీ లోక్ సభ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీ 400 సీట్లకు పైగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, నాయకులు ప్రేమ్‌సింగ్ రాథోడ్, పి.ప్రసాద్, విజయ తులసీ, కె.శ్రీధర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

### మా అన్నను గెలిపించండి - సోదరి ప్రచారం..

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 15: చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని శంషాబాద్ మండలంలోని సుల్తాన్ పల్లి, కేబీ దొడ్డి గ్రామాలలో ఆయన సోదరి అపర్ణ సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేస్తారని వివరించారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో చేవెళ్ల పార్లమెంట్‌కు భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. విద్యుత్ దీపాలు, రోడ్లు, తదితర సమస్యల పరిష్కారం కోసం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, శ్రీకాంత్ గౌడ్, సాయిలు పాల్గొన్నారు.

## మూసీలో వ్యర్థాల డంపింగ్

### - రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ అధికారులచే రూ. 25 వేల ఫైన్

బండ్లగూడ, ఏప్రిల్ 15: ఒక వైపు మూసీ సుందరీకరణ కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయాలు వెచ్చించి పనులు చేపడుతుండగా, జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో వ్యర్థాలను మూసీలో వేసి మూసేస్తున్నారు. దీంతో రోజు రోజుకీ మూసీ కుచించుకు పోతుంది. సోమవారం మెహిదీపట్నానికి చెందిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది ట్రాక్టర్‌లో వర్థాలను, చెత్త శిథిలాలను తీసుకు వచ్చి మూసీలో వేస్తున్నారు. ఇది గమనించిన స్థానికులు రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవి కుమార్‌కు సమాచారం అందించడంతో పాటు వీడియో తీసీ అందజేశారు. దీంతో ఉప కమిషనర్ రవి కుమార్ ఆ వీడియోను జీహెచ్‌ఎంసీ యాప్‌లో అప్‌లోడ్ చేసి రూ. 25 వేల జరిమానాను విధించినట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉంటే మూసీని ఇప్పటికే చాలా వరకు మూసి వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసీని కాపాడవలసిన అధికారులు మూసీలో వ్యర్థాలను పోసి మూసి వేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా మూసీ నది పరిరక్షణ అధికారులు తగిన చర్యలు తీసుకొని మూసీనదిని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### బీసీలకు అన్యాయం చేసిన బీజేపీ

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 15: కేంద్రంలో పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదని, లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు ఓటు వేసి బుద్ధి చెప్పాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేసి, జనభా ప్రాతిపదికన చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, బీసీలు కోరినా మోదీ పట్టించుకోలేదని ఆరోపించారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కేంద్రం ప్రయత్నించిందని విమర్శించారు.

## మంచి పుస్తకం ఆవిష్కరణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 15: ప్రముఖ రచయిత గోపీచంద్ సంకలనం చేసిన 'పిల్లల వాకిట్లో తేనె పొద్దు' 'మంచి పుస్తకం' పేరుతో వెలువరించిన పుస్తకావిష్కరణ సభ ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్‌లోని ఎన్వీ పాపయ్య గుప్తా హాల్‌లో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన మిసిమి మాస పత్రిక సంపాదకులు వల్లభనేని అశ్విని కుమార్, రచయితలు కందుకూరి రమేశ్ బాబు, కొసరాజు సురేశ్, సాహితీవేత్తలు చెన్నూరు సీతారాంబాబు, వలేటి గోపీచంద్‌తో కలిసి ఆవిష్కరించారు.

### బీజేపీ పాలనలో దేశ సమగ్రత, ఆర్థిక విధానాలు ధ్వంసం: దేవి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తూ దేశ సమగ్రత, ఆర్థిక విధానాలను నాశనం చేసిందని సామాజిక విశ్లేషకురాలు దేవి ఆరోపించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'భావోద్వేగ మత రాజకీయాలు' అనే అంశంపై సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సదస్సు జరిగింది. మోదీ, అమిత్ షాలు దేశ సంపదను అంబానీ, అదానీలకు అప్పనంగా కట్టబెడుతున్నారని, వీరిని ప్రశ్నించే వారిపై అధికారాన్ని వినియోగించుకుని అణచివేయడం, దాడులు చేయడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ప్రజాస్వామికవాదులపై ఈడీ, సీబీఐతో అరెస్టులు చేయించి నీచ రాజకీయాలకు తెరలేపడం సిగ్గు చేటన్నారు.

## బీఆర్ఎస్ నేత కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటు

### - చిన్న గోల్కొండ సహకార సంఘం చైర్మన్ దవణాకర్ గౌడ్



శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటని చిన్న గోల్కొండ సహకార సంఘం చైర్మన్ దవణాకర్ గౌడ్ విమర్శించారు. శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో ఉన్న బహదూర్‌గూడకు చెందిన కమ్మదానం వెంకటేశ్ గౌడ్‌తో పాటు కొందరు నాయకులు చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజీత్‌రెడ్డి ఇచ్చే ముడుపులకు ఆశపడి ఆయన సమక్షంలో పార్టీలో చేరడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన భార్య సర్పంచ్‌గా ఉన్న గత ఐదేళ్లలో ఎంపీ నిధుల నుంచి బహదూర్‌గూడకు ఒక్క రూపాయి రాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం అనేక హామీలు ఇచ్చింది. కాని అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ జగన్‌మోహన్ రెడ్డి, ధన్‌పాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు అశోక్ యాదవ్ ఉన్నారు.

### మంచినీటి సమస్యలు పరిష్కరించండి: కవితారెడ్డి



బంజారాహిల్స్, ఏప్రిల్ 15 : వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని బస్తీల్లో మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జలమండలి అధికారులను కోరారు. బంజారాహిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వర నగర్ బస్తీలో స్థానికులు మంచినీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చా రు.

## అవకాశవాద పార్టీలకు గుణపాఠం చెప్పాలి

### మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ నౌహీరా షేక్

ఖైరతాబాద్, ఏప్రిల్ 15: ప్రజలకు ఆశలు చూపి గద్దెనెక్కుతున్న అవకాశవాద పార్టీలకు గుణపాఠం చెప్పాలని ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ నౌహీరా షేక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ మ్యానిఫెస్టోను రాష్ట్ర అధ్యక్షులు జాన్ మాస్కు, వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు కె.నవ్య, ఎంఏ నజీమ్, ఇమామ్ హుస్సేన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పార్టీలు పాత భవనాలకు రంగులు వేసి, డివైడర్లు కట్టించి అందులో చెట్లు పెట్టించి అభివృద్ధి అంటున్నాయని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు లేవని, నిరుద్యోగ సమస్యలు తీరలేదన్నారు. దేశ వ్యాప్తంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లకు ఎలాంటి అభివృద్ధి నిధులు అందించడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, నిరుద్యోగులకు నెలకు రూ.15 వేల భృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆడపిల్లల వివాహానికి రూ.2.50 లక్షలు, దళితుల ఆర్థికాభివృద్ధి కోసం రూ.50లక్షలు, రోజు వారీ కూలీలు, ఆటోడ్రైవర్లకు జీవిత భీమాపథకం ద్వారా రూ.20 వేల కుటుంబ సహాయ నిధి, ప్రతి ఎస్సీ కుటుంబానికి ఇంటి స్థలం లేక గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలను తమ మ్యానిఫెస్టోలో పొందుపర్చినట్లు తెలిపారు.

### ఎన్నికలపై అవగాహన ర్యాలీ




ఎన్నికలను పురస్కరించుకొని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ పోలీసులతో పాటు సీఏపీఎఫ్, టీఎస్ఎస్పీ ఫోర్స్ పోలీసులు కలిసి పాకీజా హోటల్, సిక్ చావ్నీ, ఎంఎం పహాడీ, చింతల్‌మెట్, సులేమాన్ నగర్‌లలో పర్యటించారు. - బండ్లగూడ